క్లుప్తంగా

విజ్ఞాన్ యంగ్ జనరేషన్ సభ్యుల దాతృత్వం



చేబ్రోలు: విజ్ఞాన్ కళాశాల యంగ్ జనరేషన్ సభ్యుల బృందం విద్యాభివృద్ధికి అందిస్తున్న సహకారం ఆదర్శనీయమని వడ్లమూడి గ్రామ సర్పంచ్ మోరంపూడి అనితారాణి పేర్కొన్నారు. వడ్లమూడి గరువుపాలేనికి చెందిన ఇంటర్ విద్యార్థిని కె.అంజలికి యంగ్ జనరేషన్ బృందం సభ్యులు సోమవారం రూ.12 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రింటర్‌ను అందజేశారు.

వ్యభిచార గృహంపై దాడులు

–నిర్వాహకురాలితో సహా ఐదుగురి అరెస్ట్

పెదకాకాని: వ్యభిచార గృహంపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. పెదకాకాని శివాలయం రోడ్డులోని యాగంటి అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు..తనిఖీలు చేశారు. గృహం నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలు, మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5,490లు స్వాధీనం చేసుకున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యంపై కేసు నమోదు



పెదకాకాని: వృద్ధురాలు అదృశ్యం కావడంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నంబూరు విజయభాస్కర్ నగర్‌కు చెందిన నంబూరు కరుణమ్మ మార్చి 27న ఇంటి నుంచి బజారుకు వెళ్తున్నానని.. చెప్పి వచ్చింది. ఆ తర్వాత తిరిగి రాలేదు. బంధువులకు, తెలిసిన వారికి సమాచారం పంపించినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. తల్లి జాడ తెలియకపోవడంతో కుమారుడు నంబూరు మరియదాసు పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్



పెదకాకాని: పేకాట స్థావరంపై పోలీసులు నిర్వహించిన దాడిలో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వెనిగండ్ల గ్రామంలోని ముస్లింపాలెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు మొబైల్ ఫోన్‌లు, రూ.1,640 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

జీబీఏ ఓట్ల లెక్కింపులో అవకతవకలు



గుంటూరు లీగల్: ఇటీవల జరిగిన గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో లేడీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు సంబంధించిన ఓట్ల లెక్కింపులో తనకు అన్యాయం జరిగిందంటూ అభ్యర్థి పులి ప్రత్యూష సోమవారం ధర్నా చేపట్టారు. జీబీఏ కొత్త భవనంలోని ప్రెసిడెంట్ చాంబర్ ఎదుట ఆహారం తీసుకోకుండా ధర్నా చేస్తున్నట్లు ప్రకటించారు. రీకౌటింగ్ చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ ఎన్నికల అధికారికి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌కి, బార్ కౌన్సిల్ చైర్మన్‌కి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో ఆమె పేర్కొన్న వివరాల మేరకు.. 737 ఓట్లు ఆమెకు రాగా, తన ప్రత్యర్థికి 739 ఓట్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మొత్తం ఓట్లు 1476గా ఎన్నికల అధికారులు చెబుతుంటే, లేడీ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు పోలైన మొత్తం ఓట్లు 1598 అని ప్రత్యూష ఆరోపిస్తుంది. ఓట్ల లెక్కింపు సమయంలోనే రీకౌటింగ్‌కి లెటర్ ఇచ్చినప్పటికీ ఎన్నికల అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. ప్రస్తుతం ఓట్లను సీజ్ చేశారని, ఏపీ బార్ కౌన్సిల్ నిర్ణయం మేరకు తదు పరి చర్యలు తీసుకుంటారని, అప్పటి వరకు ధర్నాను విరమిస్తున్నట్లు ప్రకటించారు. ప్రత్యూష ఫిర్యాదు మేరకు ఎన్నికల అధికారులు వివరణ ఇచ్చారు. ప్రత్యూషకు 736 ఓట్లు రాగా, ఆమె ప్రత్యర్థి పర్చూరు కుమారి(నంద)కు 738 ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు రెండు చెల్లని ఓట్లను గుర్తించినట్లు తెలిపారు. కానీ వాటిని మరోసారి క్షుణ్ణంగా పరిశీలించగా అవి చెల్లుబాటు అయ్యే ఓట్లుగా గుర్తించినట్లు ప్రకటించారు. ఇద్దరి అభ్యర్థులకు చెరొక ఓటు యాడ్ చేయగా ప్రత్యూషకు 737, పర్చూరు కుమారికి 739 వచ్చినట్లుగా ప్రకటించారు. దీనికి సంబంధించిన డేటా స్పష్టంగా ఉందని వివరించారు. ప్రత్యూష చేస్తున్న ఆరోపణలు అందుబాటులో ఉన్న మెటీరియల్‌కు విరుద్ధంగా ఉండటంతో రీకౌటింగ్‌ను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు.

పరీక్ష సమయం.. అంతా ప్రశాంతం



నా నంబరెక్కడుందబ్బా : హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్షకు వెళ్లే ముందు ధైర్యం చెబుతూ ..

పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి నెలకొంది. తెలుగు పరీక్షకు తల్లిదండ్రులను, స్నేహితులను, బంధువులను వెంటపెట్టుకొని విద్యార్థులు వచ్చారు. ఎలాంటి కంగారు పడొద్దంటూ..విద్యార్థులకు వారు ధైర్యం చెప్పారు. పునశ్చరణలో కొందరు.. మొదటి రోజు పేపర్ ఎలా వస్తుందోనని మరికొందరు.. హాల్ టిక్కెట్, పరీక్ష సామగ్రి మొత్తం తెచ్చుకున్నామా.. లేదా అనే కంగారులో విద్యార్థులు కనిపించారు. అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలీస్ యంత్రాంగం కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. కొన్ని కేంద్రాల్లో ఒకరిద్దరు విద్యారుల గైర్హాజరు కనిపించింది. మొత్తంగా మొదటి రోజు పరీక్ష రాయడంతో.. విద్యార్థుల్లో పరీక్ష భయం కొంత వరకు తగ్గింది.



పరీక్ష సమయం.. : పరీక్ష కేంద్రంలోనికి వెళ్తున్న విద్యార్థినులు



ఆల్ ది బెస్ట్.. : విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్తున్న ఉపాధ్యాయుడు



నోటీసు బోర్డులో నంబరు చూస్తున్న విద్యార్థినులు



ఇట్స్ డ్యూటీ టైం: ప్రత్తిపాడు పరీక్ష కేంద్రం వద్ద సిబ్బందితో ఎస్ఐ రవీంద్రబాబు బందోబస్తు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు బీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఇద్దరు, శ్రీనివాస హైస్కూల్ సెంటరులో ఇద్దరు, చినకోండ్రుపాడు సెంటరులో ఒకరు. గారపాడు హైస్కూల్ పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పోలీస్ స్టేషన్‌లో భద్ర పరిచిన ప్రశ్న పత్రాలను పోలీస్ బందోబస్తుతో ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెడెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు పరీక్ష కేంద్రాలకు తరలించారు. సమయం దాటి పోవడంతో కొన్ని కేంద్రాలకు విద్యార్థులు కంగారు పడుతూ పరిగెత్తాల్సి వచ్చింది. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్ర తమ సిబ్బందితో కలిసి ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

పెదనందిపాడు: మండల పరిధిలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 382 మంది విద్యార్థులకు గానూ 377 మంది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యారని ఎంఈవో డి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. అబ్బినేనిగుంటపాలెం, పెదనందిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ పరిశీలించారు.

పదిమంది గైర్హాజరు..

పెదకాకాని: పెదకాకాని మండలంలోని వెనిగండ్ల, పెదకాకాని, కొప్పురావూరు, నంబూరు, ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలల కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 862 మంది విద్యార్థులకు గాను.. 852 మంది హాజరయ్యారు.

పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన డీఈఓ శైలజ

చేబ్రోలు: నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో జిల్లా విద్యాశాఖాధి కారి శైలజ సోమవారం తనిఖీ చేశారు. సిబ్బందికి, ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. మండల పరిధిలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 477మంది విద్యార్థులకు గాను 474 మంది మొదటి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద సిబ్బందికి పొన్నూరు రూరల్ సీఐ ప్రభాకరరావు, ఎస్ఐ కె.ఆనంద్ సూచనలు చేశారు.



నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో పోలీస్ బందోబస్తు..

బస్టాండ్‌లో ఎస్‌బీఐ ఏటీఎం సేవలు ప్రారంభం



నెహ్రూనగర్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు ఎస్‌బీఐ అన్ని వేళలా కృషి చేస్తుందని డీజీఎం(ఏఓ) దినేష్ గులాటీ తెలియజేశారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఆయన ఏటీఎం సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులు, ఉద్యోగులు బస్టాండ్‌లో నగదు విత్‌డ్రా చేసుకునేందుకు వీలుగా రెండు మిషన్లు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం(ఏటీసీ) రెహమాన్, ఏజీఎం(నెట్‌వర్క్‌- 2) రాధాకృష్ణమూర్తి, ఆర్ఎం ఏ. తారకేశ్వరరావు, మేనేజర్ వి. మాధవి, ఏటీఎం చానల్ మేనేజర్ మేడిద బాబూరావు పాల్గొన్నారు.

వెటరన్ అథ్లెట్ శేషయ్యకు సన్మానం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): జీవితాంతం క్రీడలు, శిక్షణకు జీవితాన్ని అంకితం చేసిన నగరానికి చెందిన వెటరన్ అథ్లెట్ జి.శేషయ్యను స్టార్ అథ్లెట్, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉష ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. అనేక మంది జాతీయ, అంతర్జాతీయ అథ్లెట్స్‌ను తీర్చిదిద్దిన ఘనత శేషయ్యదని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా శేషయ్యకు అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, డీఎస్ఏ చీఫ్ కోచ్ మహేష్ బాబు, పలువురు క్రీడాకారులు, కోచ్‌లు అభినందనలు తెలిపారు.

మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి జగనన్న

- ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయటం లక్ష్యం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- తురకపాలెంలో 'ఆసరా' మూడో విడత సంబరాలు



ఆసరా నగదు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తూ.. మహిళలకు పెద్ద పీటవేసి మహిళా పక్షపాతిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. సోమవారం తురకపాలెంలోని డబ్బూరి కల్యాణ మండపంలో గుంటూరు రూరల్ మండలానికి సంబంధించి పొదుపు సంఘాలకు వైఎస్సార్ ఆసరా 3వ విడత రుణ మాఫీ సాయం విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూరల్‌లో 6,480 మంది అక్కచెల్లమ్మలకు రూ.4.60 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు 90శాతం అమలు చేసి, ప్రజల ఇంటి ముందుకే పథకాలను అందజేస్తున్నామని గుర్తుచేశారు. మహిళలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా కుటుంబాలను అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న.. అమ్మ కడుపులోని బిడ్డ నుంచి.. ఆశీర్వదించే అవ్వతాతల వరకూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యా విధానంలో సమూల మార్పులు తెచ్చి.. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తయారు చేసిన ఏకైక ముఖ్య మంత్రి జగనన్న అని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 లక్షలకుపైగా పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు అందించి వారి సొంతింటి కలను సాకారం చేశారని ఎమ్మెల్యే సుచరిత పేర్కొన్నారు. జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా ఉండి రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగులు పది మందికి త్రీ వీలర్ వాహనాలను అందజేశారు. జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ముజావర్ షేక్ గుల్జార్ బేగం, వైస్ ఎంపీపీలు ఇంటూరి పద్మావతి, దర్శి సుజాత, పత్తిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్ మెట్టు రాజేశ్వరి వెంకటప్పారెడ్డి, మండల కన్వీనర్ ఆళ్ళ రవి దేవరాజు, సొసైటీ చైర్మన్ తంగెళ్ళ నాగేశ్వరరావు, ఎంపీడీఓ శోభరాణి, ఏపీఎం వెంకటరావు, సర్పంచ్‌లు డబ్బూరి సూర్య ప్రకాశరావు, నల్లమేకల అప్పమ్మ, మాధరావు, ఏరువ జగన్ మోహన్‌రెడ్డి, రాంజీ అంబేద్కర్, దుంపాల రాధ, కందుకూరి జ్యోతి, పార్టీ సీనియర్ నాయకులు, పొదుపు సంఘాల మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా నేతలు

గుంటూరు రూరల్: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నాయకులు సోమవారం నగరంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేడ్కర్ మాట్లాడారు. సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ అంశం గురించి రాష్ట్ర ప్రభుత్వం తీర్మానాన్ని అసెంబ్లీలో చేయటం చాలా దురదృష్టకరమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తుందన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాచమల్లు భాస్కరరావు, కుమార్ గౌడ్, అప్పిశెట్టి రంగా, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాయపూడి ఏసుబాబు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొరబండి వెంకయ్య, ఎస్సీ రాష్ట్ర కార్యదర్శి దర్శనం శ్రీనివాస్, తూర్పు అసెంబ్లీ కో-కన్వీనర్ వనమా నరేంద్ర, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే సేవా దృక్పథంపై అవగాహన కల్గించాలి



ముగింపు కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతో పాటుగా చిన్ననాటి నుంచి సేవా దృక్పథం అవగాహన కల్గించాలని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రవిశేఖర్ పేర్కొన్నారు. వారం రోజులుగా సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అడవితక్కెళ్ళ పాడు గ్రామంలో విద్యార్థులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు చేపట్టిన పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన, హెల్త్ క్యాంప్‌లు, ప్లాస్టిక్ నిషేదం వంటి అవగాహన కార్యక్రమాలు అభినందించదగినవని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ పాతిమా రాణి, సచివాలయం కార్యదర్శి కళ్యాణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణకుమారి, పీడీ బాలశౌరిరెడ్డి, విద్యార్థులు తదితరులున్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీ రత్నం



ప్రత్తిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి ఎత్తు, బరువు చూస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ప్రత్తిపాడు: పోషకాహారంతో రక్త హీనతను అధిగమించవచ్చని ప్రత్తిపాడు సెక్టార్ సూపర్ వైజర్ ఎంవీ రత్నం అన్నారు. పోషణ పక్షోత్సవాలలో భాగంగా సోమవారం ప్రత్తిపాడులోని వడ్డెరపాలెం అంగన్వాడీ సెంటరులో ఎంవీ రత్నం ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అత్యధిక పోషక విలువలున్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలి, ఏఏ పదార్థాల్లో పోషక విలువలు ఉంటాయి, ఏ కూరగాయలు, చిరు ధాన్యాల్లో ఎంత మొత్తంలో ప్రొటీన్లు ఉంటాయన్న విషయాలను మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడారు. రాగులు, సజ్జలు, జొన్నలు, అరికెలు, సాయలు, ఊదలు, కొర్రలు, అండ్రు కొర్రలు, వొరిగెలను ప్రతి నిత్యం తినేందుకు అలవాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సీజనల్ కూరగాయలు, పండ్లను తినడం ద్వారా మరిన్ని విటమిన్లు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్త నాగరాజ కుమారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని కొండేపాడులో పోషణ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం సెక్టార్ సూపర్‌వైజర్ అరుణ ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గర్భిణులకు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డి, సీహెచ్ఓ విజయ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే తప్పుడు కథనాలు

పట్నంబజారు: రాజకీయాల్లో ఉంటే వ్యాపారం చేయకూడదా ? ఉద్దేశపూర్వకంగా విషప్రచారం చేస్తున్నారు.. తప్పుడు వార్తలపై కచ్చితంగా స్పందిస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, షాలిని డెవలపర్స్ డైరక్టర్ లక్కాకుల థామస్ నాయుడు స్పష్టం చేశారు. నిజాయతీగా వ్యాపారం చేసుకుంటూ, రాజకీయాల్లో ఉన్న తమ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కథనాలు రాసిన ఒక పత్రికపై పరువు నష్టం దావా వేయనున్నట్లు తెలిపారు. అరండల్‌పేటలోని ఒక హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1996లో షాలిని డెవలపర్స్‌ను ఏర్పాటుచేసి ఎన్నో వెంచర్ల క్రయ, విక్రయాలు చేశామని, ఇప్పటివరకు కనీసం ఒక్క ఆరోపణ కూడా తమపై లేదని చెప్పారు. 2013 నుంచి ఐదు సంవత్సరాల పాటు వాదోపవాదాల అనంతరం హైకోర్టు ఆదేశాలతో 2018లో అంటే తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అధికారికంగా పట్టా పొందిన వారి నుంచి అవసరమైన అన్ని న్యాయపరమైన సలహాలు తీసుకుని, బహిరంగ పేపర్ ప్రకటన ద్వారా ఎవరి నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేవని రూఢీ చేసుకున్న తర్వాత 4 ఎకరాల 39 సెంట్ల స్థలాన్ని తాము కొనుగోలు చేసినట్లు స్పష్టం చేశారు.

చెత్త సేకరణకు ఇక ఈ– ఆటోలు



ఈ - ఆటోల ట్రయల్ రన్ నిర్వహిస్తున్న కమిషనర్ చేకూరి కీర్తి

నెహ్రూనగర్: నగరంలో ఇంటింటి నుంచి వ్యర్థాల సేకరణకు త్వరలోఈ-ఆటోలు అందుబాటులోకి రానున్నాయని, వాటి నిర్వహణకు కార్మికులకు శిక్షణ ఇస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం ఇన్నర్ రింగ్ రోడ్డులో ఈ-ఆటోల శిక్షణ పూర్తి చేసుకున్న కార్మికుల ట్రయల్ రన్‌ను కమిషనర్ ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్)లో భాగంగా గుంటూరు నగరానికి 220 ఈ-ఆటోలను కేటాయించిందని తెలిపారు. కార్మికులకు త్వరగా ఆటోల నిర్వహణ, నడపడంపై పట్టు వచ్చేలా చూడాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. ఈ- ఆటోలు అందుబాటులోకి వస్తే నగరంలో సమగ్రంగా పారిశుద్ధ్య పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ భాస్కర్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ కొండారెడ్డి, డీఈఈ హనీఫ్, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆనందకుమార్, సోమశేఖర్, ఆయుబ్ ఖాన్, ఏఈ దుర్గా ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

నెహ్రూనగర్: ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ కీర్తి చేకూరి అధికారుల్ని ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ముందుగా గత వారం ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులు, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉత్సాహం



చెస్ ఆడుతున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో మానసిక, శారీరక ఉత్సాహంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల మైదానంలో సోమవారం డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మనోహర్ మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తిని పెంచుకుని, రాణించడం ద్వారా భావి క్రీడాకారులుగా ఎదిగే అవకాశాలతో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించవచ్చని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్‌తో పాటు చెస్, అథ్లెటిక్స్‌ను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. అనితాదేవి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యత సాధించడం ద్వారా తోటి క్రీడాకారులతో స్నేహపూర్వక సంబంధాల్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా క్రీడలు, ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల క్రీడల కమిటీ అధ్యాపకులు డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, మేజర్ కుమార్ రాజా, డాక్టర్ రవి, చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో గ్రీనరీ అభివృద్ధికి చర్యలు

నెహ్రూనగర్: నగరంలోని శ్మశాన వాటికల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరీ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. శ్రీనివాసరావుతోటలోని హిందూ శ్మశానవాటికలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనుల్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శ్రీనివాసరావుతోట శ్మశానవాటికను ఎనిమిది డివిజన్లలోని సుమారు లక్ష మంది ప్రజలు వినియోగిస్తున్నారన్నారు. వాటికలో గ్రీనరీ, సంప్రదాయం ప్రకారం పెదకర్మ, గదులు, భోజన, వంటశాల, కేశ ఖండనం, స్నానపు గదులు, అస్థికలు భద్రపరుచు గదుల సౌకర్యాలతో పాటు బయట రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సంప్రదాయాల ప్రకారం పూడ్చటం, కట్టెలతో పాటు ఎలక్ట్రికల్ దహన యంత్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, కాండ్రుకుంట గురవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల రమేష్, తేలుకుంట్ల యోగేశ్వరరావు, సాధు రాజేష్, నగర పాలక సంస్థ ఈఈ సుందర రామిరెడ్డి, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.